www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 29 జులై 2025

5

కాకినాడ



రాఘవపట్నంలో వైద్య శిబిరం

-ప్రజాశక్తి కథనానికి స్పందన



వైద్య సేవలందిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని రాఘవపట్నంలో వైద్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 'గ్రామాల్లో విజంభిస్తున్న విష జ్వరాలు' అంటూ ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి అధికారుల స్పందించారు. సోమవారం సబ్ ప్లాన్ ఏజెన్సీ ప్రాంతమైన రాఘవపట్నం గ్రామపంచాయతీ పరిధిలోగల గ్రామాల్లో ప్రజలకు డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి వైద్య సేవలందించారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. జల్దాం, దబ్బద్రి, సార్లంక గ్రామాల్లో ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించి వివరాలు సేకరించారు.

బోధనేతర పనులతో సతమతం

- గురువులను వెంటాడుతున్న ఇతర విధులు
- యాప్‌లతో తప్పని కుస్తీలు
- తలలు పట్టుకుంటున్న ఉపాధ్యాయులు



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

జిల్లాలో పలువురు ఉపాధ్యాయులు బోధన పనుల కంటే బోధనేతర పనులే ఎక్కువగా చేయాల్సి వస్తుంది. దీంతో తీవ్ర అవస్థల నడుమ ప్రభుత్వ పాఠశాల విద్య నడుస్తోందనే విమర్శలు తల్లిదండ్రుల నుంచి వినిపిస్తున్నాయి. గత వైసిపి ప్రభుత్వం గురువులపై అనేక బోధనేతర పనులను అప్పగించి తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, బోధనకే పరిమితం చేస్తామని కూటమి పార్టీల నేతలు హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక గత సర్కారు బాటలోనే కూటమి ప్రభుత్వం పయనిస్తోందని ఉపాధ్యాయులు మండిపడుతున్నారు.

పెరిగిన పని ఒత్తిడి

జిల్లాలో 1,876 ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలలు ఉండగా ఒకటి నుంచి 10వ తరగతిలో 2,89,634 మంది విద్యార్థులు చదువుతున్నారు. మొత్తం 6,928 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. అయితే వీరికి బోధనేతర ఆన్‌లైన్ పనులు విపరీతంగా పెంచారు. ప్రతి చిన్నదాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి వస్తుంది. అంతా ఇంటర్నెట్‌తో అనుసంధానం అయ్యే పనులు కాబట్టి తరచూ సాంకేతిక సమస్యలు, సర్వర్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో రోజంతా ఆన్‌లైన్ పనుల కోసమే ఉపాధ్యాయులు కుస్తీలు పడాల్సి వస్తోంది. సమయానికి ఆన్‌లైన్ పనులు చేయాల్సి రావడంతో పలువురు తీవ్ర మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నారు. అధికారులు అతి తక్కువ గడువు విధించి 'మాకు సంబంధం లేదు. మీరు ఏమి చేస్తారో మాకు తెలియదు. ఇచ్చిన సమయానికి కచ్చితంగా పూర్తి చేయాలి' అని లక్ష్యాలను నిర్దేశిస్తున్నారు. లేకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవంటూ హెచ్చరికలు చేస్తున్నారు. దీంతో అనేకమంది టీచర్లు మానసికంగా ఆందోళనకు గురవుతున్నారు. విద్యాశాఖ అధికారులు కొందరిని లక్ష్యంగా చేసుకుని భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

బోధన పనులు పక్కదారి

బోధనేతర పనులు వలన పిల్లలకు పాఠ్యాంశాలను బోధించాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆన్‌లైన్ పనులకే సమయం అంత వెచ్చించాల్సి రావడంతో బోధన పనులు పక్కకు వెళుతున్నాయి. విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించేందుకు ఓపక్క సమయం సరిపోక, మరోవైపు సిలబస్ పూర్తికాక ఉపాధ్యాయులు ఒత్తిళ్లకు లోనవుతున్నారు. తీవ్ర మానసిక ఆందోళన ఎక్కువై కొందరు ఉపాధ్యాయులు అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. గుండెపోటు వంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

ఒత్తిళ్లను భరించలేక

స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకునే ఉపాధ్యాయుల సంఖ్య రోజు రోజుకీ పెరుగుతుంది. ఇది సరిపోదు అన్నట్లుగా ఏవిధమైన ప్రాథమిక సౌకర్యాలు లేకుండా రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణా తరగతులు, మరొకపక్క విద్యార్థులకు ఉపాధ్యాయులను దూరం చేసే విధంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విద్యా రంగంలో చదువుతున్న విద్యార్థులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు. ఇది ప్రభుత్వం తక్షణమే ఆలోచించి దీనికి దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ సందర్భంగా విద్యార్థులకు ఇచ్చిన ఒక వేప, కరివేపాకు మొక్కల గురించి ఆన్‌లైన్‌లో నమోదు, వాటికి గ్రీన్ పాస్పోర్ట్ బుక్స్ తయారు చేయడం, ఆన్‌లైన్ చేయడం ఇది ఒక పెద్ద ప్రహసనంగా మారిందని గురువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రెండు రోజుల పాటు విద్యార్థులు పాఠాలు పూర్తిగా నష్టపోయిన పరిస్థితి ఏర్పడింది. ఎర్ర చందనం మొక్కలు ఇచ్చినట్లుగా ఇచ్చిన వేప మొక్క, కరివేపాకు మొక్కలకే ఇంత తతంగం అవసరమా అని ఉపాధ్యాయులు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ మధ్యకాలంలో రాష్ట్ర ప్రభుత్వం అన్నింటికీ రికార్డుల పిచ్చితో రకరకాల కార్యక్రమాలు రూపొందించి మరే ఇతర కార్యక్రమాలు లేకుండా చేసి మొత్తం వ్యవస్థల్ని దెబ్బతీసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వీటిని వెంటనే సరిదిద్దుకోవాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉన్నదని టీచర్లు భావిస్తున్నారు.

గత ప్రభుత్వంలో యాప్‌ల సంఖ్య తగ్గించమని అనేక ఉద్యమాలు జరిగాయి. యాప్‌ల సంఖ్య తగ్గిస్తామని హామీలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. యాప్‌ల సంఖ్య తగ్గించకపోగా అన్ని యాప్ లను ఒకే యాప్‌నకు అనుసంధానం చేసి సర్వర్ సమస్యలు సృష్టించి యాప్‌లో అప్‌లోడ్ చేయడం వలన మరిన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

బోధనకే పరిమితం చేయాలి



బోధనేతర పనులు చేయించడం వలన పిల్లలకు పూర్తిస్థాయిలో పాఠ్యాంశాలను బోధించడానికి వీలు కలగడం లేదు. దీంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మరోవైపు విద్యార్థులు నష్టపోతున్నారు. సిలబస్ పూర్తికాక టీచర్లు మానసిక ఒత్తిళ్ళకు గురవుతున్నారు. అధిక సమయం బోధనకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలి.

-టి.చక్రవర్తి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

యాప్‌ల భారాన్ని తగ్గించాలి



ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా ప్రభుత్వం విద్యార్థుల సిలబస్‌కు ఆధారంగా తగినంతమంది ఉపాధ్యాయులను నియమించాలి. ఉపాధ్యాయులపై యాప్‌ల పని భారాన్ని తగ్గించాలి. బోధనేతర పనులను తగ్గించేలా చర్యలు తీసుకోవాలి.

-నగేష్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఎయిడెడ్ కళాశాలల విద్యార్థులు

ఎయిడెడ్ రక్షణకు ఎస్ఎఫ్ఐ మహా ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ

ప్రభుత్వ ఎయిడెడ్ విద్యాసంస్థలను నిర్వీర్యం చేసే ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు మహాధర్నా నిర్వహించారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ ధర్నా నిర్వహించారు. నగరంలోని ఎంఎస్ఎన్ ఎయిడెడ్, సిబిఎం ఎయిడెడ్, పెద్దాపురం ఎంఆర్ ఎయిడెడ్, అన్నవరం సత్యదేవ్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్, జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు యువగళం యాత్రలో ప్రభుత్వ ఎయిడెడ్ విద్యాసంస్థలను కాపాడుతామని స్పష్టమైన హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. నేడు అధికారంలోకి వచ్చాక ఎయిడెడ్ విద్యాసంస్థలను పూర్తిగా పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఎయిడెడ్ విద్యాసంస్థలను నిర్వీర్యం చేయడానికి కుట్రలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఏడాది నుంచి విద్యార్థులకు కనీసం పాఠ్యపుస్తకాలు అందించకపోతే వారు ఎలా చదువుకుంటారని ప్రశ్నించారు. ఇది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడటమే ధ్వజమెత్తారు. ఎయిడెడ్ జూనియర్ కళాశాలల విద్యార్థులకు తక్షణమే పాఠ్యపుస్తకాలను అందించాలని, ఎయిడెడ్ కళాశాలలలో మధ్యాహ్న భోజన పథకాన్ని వెంటనే అమలు చేయాలని, జిఒ నెం.35 ప్రకారం ఎయిడెడ్ కళాశాలలలో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వేలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఆసరాగా నిలుస్తున్న ఎయిడెడ్ కళాశాలలను ప్రభుత్వం తక్షణమే ప్రభుత్వ కళాశాలలుగా గుర్తించి, వాటి బాధ్యతలను స్వీకరించాలని కోరారు. ఎయిడెడ్ విద్యా సంస్థల విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌కి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ నగర అధ్యక్ష, కార్యదర్శులు వాసుదేవ, సాహిత్, ఉపాధ్యక్షులు రాజేష్, గమ్మివేలు, ఉపాధ్యక్షురాలు భువనేశ్వరి, నగర కమిటీ నాయకులు గుణశ్రీ, సత్యవతి, ప్రసన్న, కన్నా, కళాశాల కమిటీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూడికతీత పనులను పరిశీలించిన ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - కరప

మండలంలోని అరట్లకట్ట గ్రామంలో కాలువలు పూడికతీత పనులను ఎంఎల్ఎ పంతం నానాజీ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగు భూములకు నీటి ఎద్దడి రాకుండా కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. అధిక వర్షాలు వచ్చిన పంటలు ముంపు భారిన పడకుండా పనులు చేసేందుకు సొంత నిధులతో, దాతల సహకారంతో పూడికతీత పనులు చేపట్టడం జరిగిందని అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డ్రైయినేజీ అధికారులు, సొసైటీ ప్రెసిడెంట్ గంట వీరన్న, నాయకులు భోగిరెడ్డి కొండబాబు, బండారు మురళీ, చౌదరి, బత్తుల సతీష్, వై.మార్కండేయులు, వి.రామకృష్ణ నక్క మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న ప్రజలు

ప్రమాదాల నివారణ కోసం అఖిలపక్షం ధర్నా

ప్రజాశక్తి - తాళ్లరేవు

జాతీయ రహదారి 216పై రోడ్డు ప్రమాదాలు నివారించాలంటూ అఖిలపక్షం ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా జరిగింది. అనంతరం అఖిలపక్షం నాయకులు టేకుమూడి ఈశ్వర రావు, వల్లు రాజుబాబు, కాశి లక్ష్మణస్వామి, అత్తిలి బాబురావు మాట్లాడారు. కాకినాడ నుంచి తాళ్లరేవు మీదుగా నిర్మిస్తున్న 216 జాతీయ రహదారిని త్వరితగతిని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ రహదారి నిర్మాణ పనులు ప్రారంభించినప్పటి నుంచి అనేక రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డివైడర్లు, జంక్షన్లలో యారో మార్కులు, విద్యుత్ లైట్లు వేయకపోవడంతో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని అన్నారు. ఇప్పటికైనా హైవే, రెవెన్యూ, పోలీసు అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అఖిలపక్ష నాయకులతో సమావేశం నిర్వహించి తక్షణం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ పి.త్రినాథరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు బొంతు మోహన్, బోనం శ్రీనివాస్, పోతుల రత్నకుమారి, నల్లి ఈశ్వరరావు, దడాల బుజ్జిబాబు, మేకల గోపాలకృష్ణ, బొంతు శ్రీనివాసు, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మరోసారి టిడిపి, జనసేన మధ్య విభేదాలు

వాటర్ ట్యాంకర్ ప్రారంభోత్సవాన్ని బహిష్కరించిన టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పట్టణంలో మరోసారి టిడిపి, జనసేన మధ్య విభేదాలు బయటపడ్డాయి. నగర పంచాయతీ ప్రజల తాగునీటి సరఫరా కోసం కాంట్రాక్టర్, దాత వల్లభశెట్టి సత్యనారాయణ తన భార్య వెంకటరమణ జ్ఞాపకార్థం రూ.4.05 లక్షల విలువ చేసే వాటర్ ట్యాంకర్‌ను బహుకరించారు. సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద వాటర్ ట్యాంకర్‌ను పిఠాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ చేతుల మీదుగా వాటర్ ట్యాంకర్‌ను ప్రారంభించారు. దాత ఇచ్చిన వాటర్ ట్యాంకర్ ప్రారంభోత్సవానికి జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్‌తోపాటు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఎస్‌విఎస్ఎన్.వర్మను ఆహ్వానించారు. అయితే ప్రారంభోత్సవానికి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో వర్మ ఫొటోను వేయకపోవడంతో పట్టణ టిడిపి అధ్యక్షులు గుండ్ర సుబ్బారావు, టిడిపి నాయకులు దొమ్మేటి మనోహర్, దువ్వా తాతాజీ, గుల్ల సుబ్బారావు, తదితరులు మున్సిపల్ కమిషనర్ కనకారావుని కలిసి నిలదీశారు. ఫ్లెక్సీలో జనసేన పార్టీకి చెందిన వారి ఫోటోలు వేసి టిడిపి ఇన్‌ఛార్జ్ ఫొటో వేయకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ నాయకుడిని ఆహ్వానించి అవమానించడం సరికాదని, తమను అవమానించేందుకే ఆహ్వానిస్తున్నారా? అని నిలదీశారు. అనంతరం వాటర్ ట్యాంకర్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని టిడిపి శ్రేణులు బహిష్కరించి వెళ్లిపోయారు. దీంతో టిడిపి, జనసేన పార్టీల మధ్య విబేధాలు మరోసారి చర్చానీయాంశం అయ్యాయి. అనంతరం మర్రెడ్డి శ్రీనివాస్ వాటర్ ట్యాంకర్‌ను ప్రారంభించి మాట్లాడారు. నగర పంచాయతీలో తాగునీటి సమస్యపై డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ నిరంతరం పర్యేక్షిస్తున్నారని, మంచి నీటి సమస్య పరిష్కారం కోసం రూ.114 కోట్లతో శాశ్వత పరిష్కారం చేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.కనకారావు, జనసేన నాయకులు కడారి తమ్మయ్యనాయుడు, బస్వా చిట్టిబాబు, మామిడాల సూరిబాబు, గరగ తాతాజీ, బలిరెడ్డి గంగబాబు, వినుకొండ అమ్మాజీ, తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌తో మాట్లాడుతున్న టిడిపి నేతలు

ఆర్మీ ర్యాలీ, హాకీ టోర్నీ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ క్రీడా మైదానం వేదికగా ఆగస్టు 3 నుంచి 20 వరకు ఆర్మీ నియామక ర్యాలీ, 1 నుంచి 12వ తేదీ వరకు జాతీయ జూనియర్ మహిళల హాకీ ఛాంపియన్ షిప్ పోటీల ఏర్పాట్లను సోమవారం జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా పరిశీలించారు. రెవెన్యూ, ఆర్మీ, నగరపాలక సంస్థ, క్రీడా అభివృద్ధి, హాకీ ఆంధ్రప్రదేశ్ అధికారులతో ఏర్పాట్లపై ఆయన చర్చించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లా అధికార యంత్రాంగం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఈ రెండు కార్యక్రమాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్యం, క్రీడాకారుల వసతి, భోజనం ఇతర సదుపాయాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ నెల 30 నాటికి ఏర్పాట్లు పూర్తి చేసేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో డిఆర్ఒ ఎస్.వెంకటరావు, ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, నగర పాలక సంస్థ ఎస్ఇ వెంకటరావు, ఎంహెచ్ఒ డాక్టర్ పృథ్వీచరణ్, డిఎస్‌డిఒ బి.శ్రీనివాసకుమార్, సమాచార పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్, ఇన్ఫిర్మేషన్ ఇంజనీర్ సిహెచ్.బాబురావు, ఆర్మీ అధికారులు, హాకీ ఆంధ్ర ప్రతినిధులు పాల్గొన్నారు.

సత్రాలను పరిశీలించిన ఛైర్మన్ రోహిత్

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం దేవస్థానంలో యాత్రికుల వసతి గదులు కేటాయించే వివిధ సత్రాలను దేవస్థానం ఛైర్మన్ ఐవి.రోహిత్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు వసతి కల్పించే సత్రాల్లో సదుపాయాలన్నీ నాణ్యత ప్రమాణాలతో ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. ఇటీవల కాలంలో న్యూ సిసి, ఓల్డ్ సిసి సత్రాలను మరమ్మతులు చేయించారు. వాటికి రంగులు వేయించడం తోపాటు, గదులలో నీటి సరఫరా, విద్యుత్తు సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ఆయా వసతి గదులను ఛైర్మన్ పరిశీలించారు. గదులతో పాటు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ రామకృష్ణ, సిఆర్ఒ, శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.



వివరాలను తెలుసుకుంటున్న ఛైర్మన్ రోహిత్

కబడ్డీ పోటీలకు శ్రీప్రకాష్ విద్యార్థులు

ప్రజాశక్తి - తుని

రాష్ట్ర స్థాయి కబాడ్డీ పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు ఉత్తమగా రాణించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించడం పట్ల విద్యా సంస్థల అధినేత సిహెచ్‌వికె. నరసింహా రావు, విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయప్రకాష్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఉత్తమ ప్రతిభను కనబరిచి విద్యార్థులకు సోమవారం అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి 27 వరకూ తెలంగాణా రాష్ట్రంలోని కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో తమ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించారని అన్నారు. సెప్టెంబర్ 13 నుంచి 16 వరకూ బీహార్‌లో జరిగే జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు తమ విద్యార్థులు అర్హత సాధించారని అన్నారు. గత మూడు సంవత్సరాలుగా సిబిఎస్ఇ క్లస్టర్ - 7 కబడ్డీ పోటీల్లో అండర్ -19 విభాగంలో శ్రీప్రకాష్ విద్యార్థులు బంగారు పతకాలు సాధిస్తున్నారని అన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను వారితోపాటు, సీనియర్ ప్రిన్సిపల్ ఎంవివిఎస్.మూర్తి, వైస్ ప్రిన్సిపల్ ఎం.అపర్ణ, కోచ్ లక్ష్మణ్, చినరాజు అభినందించారు.



విజేతలతో స్కూల్ యాజమాన్యం

రెండు కుటుంబాలను దత్తత తీసుకున్న పోలీసులు

ప్రజాశక్తి - కోటనందూరు

ప్రభుత్వ ఆదేశాల్లో భాగంగా మండలంలోని కాకరపల్లి, జగన్నాథపురం గ్రామాలకు చెందిన రెండు నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకోవడం జరిగిందని తుని రూరల్ సిఐ జి.చెన్నకేశవరావు, కోటనందూరు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. జగన్నాథపురం గ్రామానికి చెందిన గుడివాడ రమణ కుటుంబాన్ని, కాకరపల్లి గ్రామానికి చెందిన అల్లూరి సత్యనారాయణ కుటుంబాన్ని గ్రామ పెద్దల సమక్షంలో దత్తత తీసుకోవడం జరిగిందని అన్నారు. కుటుంబాలను ప్రభుత్వం అందించే పథకాలు, రేషన్లు, ఆరోగ్య పరిరక్షణ, వృత్తి ఆధారిత ఉపాధి అవకాశాలను కల్పిస్తామని అన్నారు.




దత్తత తీసుకున్న కుటుంబీకులతో పోలీసులు

త్రీ మెన్ కమిటీ ఛైర్మన్‌గా వరుపుల

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలోని లంపకలోవ సొసైటీ త్రీమేన్ కమిటీ ఛైర్మన్‌గా పెదశంకర్లపూడి గ్రామానికి చెందిన వరుపుల రామకృష్ణ ప్రమాణస్వీకారం చేశారు. పదవి బాధ్యతలు చేపట్టారు. సోమవారం సొసైటీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ పాల్గొని త్రీమేన్ కమిటీ ఛైర్మన్‌గా వరుపుల రామకృష్ణ, డైరెక్టర్లుగా మదినే దొరబాబు, కంచుపాటి సూరిబాబులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి పాలకమండలి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొమ్ముల కన్నబాబు, జనసేన నాయకులు మేడిశెట్టి సూర్య కిరణ్, యాళ్ల జగదీశ్, దలే నవీన్, వరుపుల సాయితర్షిత్, చక్కపల్లి నవీన్, దాసం శేషారావు పాల్గొన్నారు.



త్రీమేన్ కమిటీని అభినందిస్తున్న ఎంఎల్‌ఎ



కార్టూ'నిజం'

10 వేల మందికి ఉద్యోగోన్నతులు

ప్రజాశక్తి - సామర్లకోట

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో దశలవారీగా 10 వేల మందికి పదోన్నతులు కల్పించినట్లు డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఒఎస్‌డి వెంకటకృష్ణ తెలిపారు. సోమవారం స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో ఎంపిడిఒలుగా పదోన్నతులు పొందిన 46 మందికి నెల రోజుల పాటు ఇచ్చే ప్రాథమిక శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ వ్యవస్థ ప్రజలకు మరింత ఉపయోగపడేలా మార్చేందుకు డిప్యూటీ సిఎం పని చేస్తున్నారని అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతి ఉద్యోగికి సకాలంలో పదోన్నతులు కల్పించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. పదోన్నతులు పొందిన ఉద్యోగులు సమన్వయాన్ని పెంపొందించుకోవాలని, పరిపాలన నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు. ఈ శిక్షణలో ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన 46 మంది ఎంపిడిఒలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కేంద్ర ప్రిన్సిపల్ కెఎన్‌వి.ప్రసాదరావు, ఉప ప్రిన్సిపల్ జి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు పూర్తిస్థాయిలో సాగునీరు

ప్రజాశక్తి - కోటనందూరు

మెట్ట ప్రాంత రైతాంగానికి ఖరీఫ్ వరి పంటలకు అవసరమైన సాగునీటిని సమృద్ధిగా అందిస్తామని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ యనమల దివ్య అన్నారు. సోమవారం మండలంలోని బిళ్ళనందూరు, కొత్త కొట్టం గ్రామాల్లో ఆమె పర్యటించారు. కొత్తకొట్టం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వైసిపికి చెందిన పలువురు వార్డు మెంబర్లు, కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం బిళ్లనందూరులో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు యనమల రాజేష్, పోతల సూరిబాబు, గాడి రాజబాబు, బైలపూడి శ్రీరాంమూర్తి, మతిరెడ్డి బాపిరాజు, చిటికెల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంకంరెడ్డి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనుల పరిశీలన

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలు గ్రామంలోని హేమనాథరావు హాస్పిటల్ ఏరియాలో నూతనంగా నిర్మిస్తున్న డ్రెయినేజీ పనులను సోమవారం ఎపి పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సూరిశెట్టి జయకృష్ణ పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను నాణ్యతతో నిర్మించాలని, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్, అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో జనసేన నాయకులు ఉలవల శీను, తేటకాల నాగసత్తిబాబు, ఇంజనీరింగ్ అసిస్టెంట్, తదితరులు పాల్గొన్నారు.



డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న జయకృష్ణ

డెకాయ్ ఆపరేషన్లను ముమ్మరం చేయాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

డివిజన్ పరిధిలోని స్కానింగ్ సెంటర్లపై డెకాయి ఆపరేషన్లు ముమ్మరం చేయాలని ఆర్‌డిఒ శ్రీ రమణి ఆదేశించారు. సోమవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో డివిజన్ ఆఫీసర్ డాక్టర్ ఎన్.ప్రశాంతి ఆధ్వర్యంలో డివిజనల్ స్థాయి గర్భస్థ, శిశు లింగ నిర్ధారణ పరీక్షల నిరోధ కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ తరచుగా స్కానింగ్ సెంటర్లను తనిఖీలు నిర్వహించాలన్నారు. డాక్టర్ ఎన్.ప్రశాంతి మాట్లాడుతూ గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం ప్రకారం ఏదైనా తప్పు మొదటిసారి చేస్తే మూడేళ్ళ జైలు శిక్ష, రూ.10,000 జరిమానా ఉంటుందన్నారు. రెండవసారి తప్పు చేస్తే ఐదేళ్లుజైలు శిక్ష రూ.50 వేలు జరిమానా విధించబడుతుందన్నారు. వీటితోపాటు, ఆయా జరిమానాల ఆధారంగా అర్హతలను కోల్పోయే అవకాశాలు ఉన్నాయన్నారు. డివిజన్ పరిధిలో 41 గుర్తింపు పొందిన స్కానింగ్ సెంటర్లు ఉన్నాయన్నారు. వీటిపై వివిధ దఫాలుగా దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో పలువురు న్యాయవాదులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

భర్తపై కత్తిపీటతో దాడి

ప్రజాశక్తి - అమలాపురం

భార్య కత్తిపీటతో దాడిచేసిన ఘటనలో భర్త గాయపడ్డాడు. ప్రభుత్వ పథకం 'తల్లికి వందనం' ద్వారా వచ్చిన డబ్బుల వాడకంపై వివాదం దారుణ ఘటనకు దారి తీసింది. అమలాపురం టౌన్‌లోని సావరం రోడ్డులో నివసిస్తున్న పెనుమాల దుర్గాప్రసాద్ తన భార్యను 'తల్లికి వందనం డబ్బులు ఏమయ్యాయని అని ప్రశ్నించగా, తీవ్ర ఆగ్రహానికి లోనైన ఆమె కత్తిపీటతో భర్తపై దాడి చేసింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన దుర్గాప్రసాద్‌ను స్థానిక ప్రభుత్వాసు పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పథకం ద్వారా వచ్చిన డబ్బులు గతంలో ఎలా ఖర్చు చేశారన్న దానిపై కుటుంబంలో వాగ్వాదం జరిగిందని, అదే ఘర్షణకు దారి తీసిందని తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై ఎస్ఐ కిషోర్ ాబు మాట్లాడుతూ, పూర్తి వివరాలు సేకరించి చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని దిగువాసివాడ గ్రామ శివారు తాండవ గట్టు సమీపంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో రూ.4,200 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురును అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

అనారోగ్యంతో యాచకుని మృతి

ప్రజాశక్తి - యానాం

యానాం బైపాస్ రోడ్డులో అధిక మద్యం సేవించి అపస్మారక స్థితిలో ఉన్న యాచకుడిని ఈనెల 22న యానాం జిజిహెచ్‌కు స్థానికులు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. ఆ వ్యక్తి సోమవారం మధ్యాహ్నం చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించి మృతి చెందినట్లు ఎస్ఐ పునీత్‌రాజ్ తెలిపారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచిన్నట్లు తెలిపారు. అతని గురించి ఏదైనా సమాచారం ఉంటే యానాం పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పటవల పైడా కళాశాల సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. యానాం నుంచి కాకినాడ వైపు ద్విచక్ర వాహనంపై వెళు న్న వ్యక్తిని కాకినాడ వైపు నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. యానాం సావిత్రి నగర్‌కు చెందిన వ్యక్తిగా తెలిసింది. ఆ వ్యక్తి అపస్మారక స్థితికి లోనైనట్లు స్థానికులు తెలిపారు.

మాజీ కౌన్సిలర్ రామకృష్ణ మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం



మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పప్పుల రామకృష్ణ(75) సోమవారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 2005 సంవత్సరంలో ఆయన మున్సిపల్ కౌన్సిలర్‌గా సేవలందించారు. ఆయన మృతికి మున్సిపల్ మాజీ ఛైర్మన్ ముప్పన శ్యామలాంబ, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, సిపిఎం నాయకులు నీలపాల సూరిబాబు, దారపురెడ్డి క్రాంతికుమార్, దారపురెడ్డి కృష్ణ, రొంగల వీర్రాజు, గడిగట్ల సత్తిబాబు, మాజీ కౌన్సిలర్ కూనిరెడ్డి అరుణ సంతాపం వ్యక్తం చేశారు.

క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద సోమవారం నిర్వహించిన అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం చేశారు. ఈ అన్న క్యాంటీన్‌కు గోకవరం మండలం వెదురుపాక గ్రామానికి చెందిన టిడిపి నాయకులు పిల్లా అర్జున్‌సారథి, బత్తుల శ్రీనివాస సారంగదరుడు ఆర్థిక సాయాన్ని అందజేశారు. అన్నదాన కార్యక్రమాన్ని ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్‌విఎస్. అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్తకొండబాబు, పిల్ల చంటిబాబు, ఎస్.బాబు, నండ్ల చిరంజీవి, బోదిరెడ్ల సుబ్బారావు, వేములకొండ జోగారావు పాల్గొన్నారు.

బిసి చైతన్య వేదిక మహిళా అధ్యక్షురాలిగా వెంకటలక్ష్మి

ప్రజాశక్తి - సామర్లకోట

బిసి చైతన్య వేదిక జిల్లా మహిళా అధ్య క్షురాలుగా సామర్లకోటకు చెందిన పెంకే వెంకటలక్ష్మి నియమితులయ్యారు. సోమవారం కాకినాడలో జరిగిన బిసి చైతన్య వేదిక సమావేశంలో జాతీయ అధ్యక్షులు వీరవల్లి శ్రీనివాస్, బిసి మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయుడు దుర్గ అధ్యక్షతన తనను ఎంపిక చేసినట్లు తెలిపారు. తనపై నమ్మకంతో పదవిని అప్ప గించిన సంఘ నేతలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. బిసి ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేస్తానని అన్నారు.

నాయకత్వంపై శిక్షణ

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఉపాధ్యాయులకు పాఠశాల నిర్వహణ, మెలకువలు, నాయకత్వ లక్షణాలపై శిక్షణా తరగతులు నిర్వహించారు. సోమవారం మండలంలోని చేబ్రోలు ఆదర్శ ఇంజనీరింగ్ కాలేజ్‌లో హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణా తరగతులను డివైఇఒ, నాయుడు వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 31 వరకు ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ శిక్షణ తరగతుల కోర్స్ డైరెక్టర్‌గా ఎంఇఒ వి.జగన్మోహన్, రిసోర్స్‌పర్సన్ గా పెదపూడి ఎంఇఒ-2 సివివి.సత్యనారాయణ, పిఠాపురం ఎంఇఒ-2 నారాయణదాసు వ్యవహరించారు.

ఘనంగా మరిడమ్మ సంబరం

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మ జాతర ఉత్సవాలలో భాగంగా పట్టణంలోని వ్యాపారపుంతవాసులు మరిడమ్మ సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యుత్ దీపాలంకరణల మధ్య ఏర్పాటుచేసిన పౌరాణిక పాత్రల బండ్ల వేసాలు అందర్నీ విశేషంగా ఆకట్టుకున్నాయి. అలాగే జానపద కళారూపాలు, పెద్ద పులాటలు సాముగరిడీలు, కాలిక, గరగల నృత్యాలు అందర్నీ అలరించాయి. కమిటీ సభ్యులు సంబరాన్ని పర్యవేక్షించారు.

శిథిలావస్థలో ప్రభుత్వ ఐటిఐ షెడ్డు

-స్థలం కేటాయించిన ఫలితం లేదు
- శిథిలమైన షెడ్డులోనే తరగతులు

ప్రజాశక్తి - జగ్గంపేట

ప్రభుత్వ ఐటిఐ గతంలో కాకినాడలో మాత్రమే ఉండేది. అయితే 2018లో నాటి టిడిపి ప్రభుత్వం ప్రతీ జిల్లాకు మరోక ప్రభుత్వ ఐటిఐను మంజూరు చేసింది. దీనిలోభాగంగా జిల్లాకు అదనంగా వచ్చిన ప్రభుత్వ ఐటిఐని ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ జగ్గంపేటలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వాన్ని ఒప్పించారు. పోలవరం కాలువ స్పాయిల్ బ్యాంక్‌ను ఖాళీ చేసిన ప్రాంతాన్ని ఐటిఐ నిర్మాణానికి కేటాయింపులు చేశారు. పక్కా భవనాలు నిర్మించేంత వరకూ తాత్కాలికంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని రేకుల షెడ్డులో క్లాసులు నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన



ఒరిగిపోతున్న తరగతులు నిర్వహిస్తున్న షెడ్డు

వైసిపి ప్రభుత్వం ఐటిఐ నిర్మాణాన్ని పూర్తిగా పక్కన పెట్టేసింది. దీంతో నాటి నుంచి తాత్కాలికంగా తరగతి గదులు ప్రారంభించిన రేకుల షెడ్డులోనే తరగతులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఆ షెడ్డు శిథిలావస్థకు చేరుకుంది. వర్షం వస్తె లోపలికి వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. నీరు లోపలకి రాకుండా తార్పాలిన్స్ వేసుకుని అధ్యాపకులు క్లాసులు నిర్వహిస్తున్నారు. కళాశాల వద్ద అధ్యాపకులు, విద్యార్థుల కోసం కనీస సౌకర్యాలను కల్పించలేదు. గత ఏడేళ్లగా ఇబ్బందులు పడుతూనే అధ్యాపకులు క్లాసులు నిర్వహిస్తున్నారు. ఐటిఐను తీసుకొచ్చిన ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ స్థలం కేటాయించిన ప్రాంతంలోనే పక్కా భవనాలు నిర్మించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఐటిఐకు పక్కా భవనం నిర్మించాలి

ఐటిఐకు పక్కా భవనాన్ని నిర్మించాలని బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ జుత్తుక నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ప్రస్తుతం క్లాసులు నిర్వహిస్తున్న రేకుల షెడ్డు వద్ద కనీస వసతులు లేవన్నారు. సౌకర్యాలు లేక అధ్యాపకులు, విద్యార్థులు ఇబ్బందులు పడు తున్న ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం విచారక రం అన్నారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

గ్రీన్, రెడ్, అంబర్ జోన్ల ఏర్పాటు

ప్రజాశక్తి - సామర్లకోట

ట్రాఫిక్ రద్దీ వీధి వ్యాపారం సజావుగా సాగడానికి పట్టణంలో గ్రీన్, రెడ్ అంబర్ జోన్లు గుర్తించి చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య చెప్పారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శ్రీవిద్య అధ్యక్షతన టౌన్ వెండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వీధి వ్యాపారాలను సురక్షితంగా నిర్వహించేలా, ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా జోన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. వ్యాపార కార్యకలాపాలకు అనుకూలంగా గ్రీన్ జోన్లు ఏర్పాటు చేయడంపై చర్చించారు. ట్రాఫిక్ రద్దీ అధి కంగా ఉండే ప్రాంతాలను రెడ్ జోన్లుగా గుర్తించారు. అలాగే, తేదీ మరియు సమయాన్ని అనుసరించి వ్యాపారం చేయదగిన ప్రాంతాలను అంబర్ జోన్లుగా గుర్తించడం జరిగిందన్నారు. వీధి వ్యాపారులు తమ కార్యకలాపాలు సరైన విధంగా కొనసాగించేందుకు ఐడీ కార్డులు, వెండింగ్ సర్టిఫికెట్లు జారీ చేయాలని సమావేశంలో నిర్ణయించారు. పట్టణ అభివృద్ధి, ట్రాఫిక్ నిర్వహణ, చిన్న వాణిజ్య వ్యాపారాలకు అనుకూల వాతావరణం కల్పించుటకు ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిప ల్ టిపిఒ మంజుల, ట్రాఫిక్ ఎస్ఐ గరగారావు, ఎస్‌బిఐ మేనేజర్ సీతారా మయ్య, సిరి మానసిక వికలాం గుల నిర్వాహకులు గోపిదేవి పాల్గొన్నారు.

రెండున్నర గంటల్లో బాలిక అప్పగింత

ప్రజాశక్తి - సామర్లకోట

తప్పిపోయిన బాలికను రెండున్నర గంటల్లోనే పట్టుకుని తల్లిదండ్రులకు స్థానిక పోలీసులు అప్పగించారు. స్థానిక జగనన్న కాలనీకి చెందిన గుడిసె బాలమ్మ కుమార్తె లాస్య(15) ఆదివారం సాయంత్రం కనిపించకుండా పోయిందని తల్లిదండ్రులు స్థానిక పోలీసులను ఆశ్రయించారు. దీంతో సిఐ కృష్ణభగవాన్ రెండు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. చెవిటి, మూగ కలిగిన ఆమె ఎక్కడకు వెళ్లాలో తెలియక స్థానిక రైల్వేస్టేషన్‌లో ఉండిపోయింది. అయితే ఆమె ఆచూకీ కోసం తిరుగుతున్న పోలీసులు కేవలం రెండున్నర గంటల వ్యవధిలోనే ఆమె రైల్వేస్టేషన్‌లో ఉన్నట్లు గుర్తించి



బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సిఐ కష్ణ భగవాన్

తల్లిదండ్రులకు అప్పగించారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే స్పందించి ఆమెను కనిపెట్టి తల్లిదండ్రులకు అప్పగించిన సిఐ కృష్ణభగవాన్, ఎస్ఐ డి.రమేష్, ఎఎస్ఐ శ్రీనివాస్, సిబ్బందిని ఎస్‌పి బిందుమాధవ్, డిఎస్‌పి శ్రీహరిరాజు అభినందించారు.

జాగృతి-25పై అవగాహన అవసరం

ప్రజాశక్తి - పెద్దాపురం

సచివాలయాల సిబ్బంది, పంచాయతీల కార్యదర్శులు జాగృతి-2025పై పూర్తిస్థాయి అవగాహన పెంచుకోవాలని ఎంపిడిఒ డి.శ్రీలలిత అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాగృతి-2025 న్యాయ సేవా కార్యక్రమాలపై జరిగిన అవగాహన సదస్సుకు ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. సిబ్బంది అవగాహన పెంచుకోవడం ద్వారానే ప్రజలకు న్యాయ సహాయం అందించగలుగుతారన్నారు. ఈ సదస్సులో న్యాయవాదులు మడికి రాంబాబు, సకురు దుర్గారావు చట్టాలపై అవగాహన కల్పించారు. పోస్టు మాస్టర్ జిడిఎస్.ప్రసాద్ మాట్లాడుతూ పోస్టల్ స్కీంలో ఉన్న వివిధ పథకాలను వివరించారు. ఈ సదస్సులో మండల పరిషత్ కార్యాలయ ఎఒ ఎం.సత్యనారాయణమూర్తి, పారా లీగల్ వాలంటీర్లు నూతలపాటి అప్పలకొండ, మాసా చంద్రరావు, బళ్లమూడి సూర్యనారాయణమూర్తి, కెవి.లక్ష్మి పాల్గొన్నారు.

మధుమేహాన్ని అదుపులో ఉంచడం అవసరం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

మధుమేహాన్ని నిరంతరం అదుపులో ఉంచుకునేలా జాగ్రత్తలు పాటించాలని రమణ క్లినికల్ లేబరేటరీ అధినేత ఎల్.కృష్ణమూర్తి అన్నారు. స్థానిక బోటు క్లబ్ ఉద్యానవనంలో వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీరంలో ఉత్పత్తి అయిన ఇన్సులిన్‌ను రక్తం సరిగా గ్రహించకపోవడం వలన రక్తంలో గ్లూకోజ్ స్థాయి అధికమై మధుమేహానికి కారణమవుతుందన్నారు. దాన్ని అశ్రద్ధ చేస్తే గుండె, కిడ్నీ, మెదడు, కంటి చూపు దెబ్బతింటుందన్నారు. దానిని అదుపు చేయడానికి ప్రతీ రోజు 45 నిమిషాలు వ్యాయామం చేయాలని, కొవ్వు పదార్థాలను పరిమితంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ సంఘ అధ్యక్షులు అడబాల రత్నప్రసాద్, కార్యదర్శి డాక్టర్ దాసరి శ్రీధర్, సూర్యనారాయణ, దివ్య, ప్రసాద్ నాయుడు, రేలంగి బాపిరాజు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ

కలెక్టరేట్‌కు వచ్చే అర్జీదారుల సౌలభ్యం కోసం నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంట్‌ను కలెక్టర్ షాన్ మోహన్ సగిలి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్లో ప్లాస్టిక్‌ను నిషేధించిన నేపథ్యంలో రూ.1.60 లక్షల వ్యయంతో వెయ్యి లీటర్ల సామర్థ్యం గల ఆర్ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. కలెక్టరేట్ అధికారులు, సిబ్బందికి, ప్రతి వారం పిజిఆర్‌ఎస్‌కు వచ్చే అర్జీదారులకు ఈ ప్లాంట్ ద్వారా తాగునీరు సదుపాయం కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జెసి రాహుల్ మీనా, డిఆర్ఓ ఎస్.వెంకటరావు, కలెక్టరేట్ ఎఒ ఎస్.రామ్మోహన్, ఎం వన్ శివ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టరేట్ సాధించిన రాధాకృష్ణవేణికి సత్కారం

ప్రజాశక్తి - సామర్లకోట

సైకాలజీలో డాక్టరేట్ అందుకున్న మాధవ పట్నం జడ్‌పి ఉన్నత పాఠశాల టీచర్ డాక్టర్ కూనిశెట్టి రాధాకృష్ణవేణిని సోమవారం ఘనంగా సత్కరించారు. హైస్కూల్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో డివైఇఒ నాయుడు వెంకటేశ్వరరావు, ఎంఇఒలు వై.శివరామ కృష్ణయ్య, పి.పుల్లయ్య పాల్గొని డాక్టరేట్ పొందిన టీచర్ సేవలను కొనియాడారు. హైస్కూల్ హెచ్‌ఎం టి.మురళీకృష్ణ అధ్యక్షతన ఆమె ఘనంగా సత్కరించారు.

అంతరిక్ష పరిశోధనలపై అవగాహన

ప్రజాశక్తి - పిఠాపురం

సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో సమగ్ర శిక్షా, ముస్కాన్ సహకారంతో స్థానిక ఆర్‌ఆర్‌బిహెచ్‌ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంతరిక్ష పరిశోధనలపై అవగాహన సదస్సు సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి కె. వెంకటేశ్వర్లు, సైన్స్ సిటీ స్టేట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్రీకాంత్ ముస్కాన్ సంస్థ చీఫ్ ఆపరేషనల్ మేనేజర్ ప్రసిద్ధి దీప్నాథ్, సైన్స్ సిటీ రిలేషన్ ఆఫీసర్ శివరాం, డివైఇఒ వెంకటేశ్వరరావు, జిల్లా సైన్స్ అధికారి ఎం శ్రీనివాస్ వినిల్ పాల్గొన్నారు. విద్యార్థులకు రాకెట్ లాంచింగ్ విధానం వివిధ రకాల రాకెట్లు, వాటిలో వాడే ఇంధనాలు టెలిస్కోప్, రోబోటిక్స్, వర్చువల్ రియాలిటీ, డ్రోన్లు వంటి ఆధునిక సాంకేతిక అంశాలపై ప్రాథమిక అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం యాహియా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిజిఆర్‌ఎస్‌లో అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి - యంత్రాంగం

పెద్దాపురం స్థానిక డివిజనల్ రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్‌ఎస్‌లో 8 అర్జీలు వచ్చాయి. ప్రజల నుంచి ఆర్‌డిఒ శ్రీరమణి అర్జీలను స్వీకరించారు. సంబంధిత కార్యాలయాలకు పంపించి వెంటనే పరిష్కరించి అర్జీదారులకు తెలియజేయాలని ఆర్‌డిఒ ఆదేశించారు. **పిఠాపురం** స్థానిక పాడా కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్‌ఎస్‌లో ప్రజల నుంచి పాడా పీడీ (ఎఫ్‌ఎసి) ఎన్‌వివి.సత్యనారాయణ అర్జీలు స్వీకరించారు. మొత్తం వివిధ సమస్యలకు సంబంధించి 67 అర్జీలు అందాయని ఆయన తెలిపారు. ఈ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాడా ఎపిడి వసంతమాధవి, మున్సిపల్ కమిషనర్, కొత్తపల్లి, పిఠాపురం తహశీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

ప్రజాశక్తి - తుని

స్థానిక టిడిపి కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ యనమల దివ్య సోమవారం పలువురికి సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. తుని అర్బన్, రూరల్, కోటనందూరు, తొండంగి మండలాలకు చెందిన పలువురు బాధితులకు రూ.10.71 లక్షల విలువ చేసే చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి, అంకమరెడ్డి బుల్లిబాబు పాల్గొన్నారు.

భౌతిక శాస్త్ర ప్రయోగాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎసిటి సైన్స్ సెంటర్లో సోమవారం మండలంలోని ఆర్‌బి.కొత్తూరు జడ్‌పి హైస్కూల్ పదవ తరగతి విద్యార్థులకు భౌతిక శాస్త్ర ప్రయోగాలపై అవగాహన కల్పించారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. జంతు ప్రేమికుడు నవీన్ నాని పాముల జీవన విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యవాణి, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని అచ్చంపేట 33/11 కెవి కొత్త సబ్‌స్టేషన్ లైన్ పనుల కారణంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎన్‌డిఎస్.ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అచ్చంపేట, కొప్పవరం, పనసపాడు గ్రామాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

లైంగిక వేధింపుల చట్టంపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం లైంగిక వేధింపుల చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్, ప్రిన్సిపల్ దేవరపల్లి చెన్నారావు మాట్లాడారు. మహిళల లైం గిక వేధింపుల నుంచి అరికట్టేందుకు పోక్సో 2013 చట్టాన్ని రూపొందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం లో వైస్ ప్రిన్సిపల్ సిహెచ్.బాలరాజు, తెలుగు అధ్యాపకురాలు డి.సత్యలత, ఇతర అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - సామర్లకోట

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి అన్నారు. సోమవారం మండలంలోని వికె.రాయపురం గ్రామంలో నిర్మించిన సిసి రోడ్లు, డ్రెయిన్లు, బిటి రోడ్డును వారు ప్రారంఇంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం గ్రామాభివృద్ధి పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ సర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు శివరామకృష్ణ, ఎంపిడిఒ కాదా హిమామహేశ్వరి, డిఇ రామకృష్ణ, గ్రామ కార్యదర్శి వై.శ్రీహరి, సొసైటీ అధ్యక్షుడు కుర్రా నారాయణస్వామి, నాయకులు తోటకూర శ్రీనివాస్, ముసిరెడ్డి శ్రీరాములు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది.

పశువుల ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - రౌతులపూడి

వర్షాకాలంలో పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు అవసరమని స్థానిక పశు వైద్య అధికారి డాక్టర్ విజయ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెరిగిన తేమ కారణంగా పశువులు వివిధ రకాల వ్యాధుల భారిన పడే అవకాశం ఉందన్నారు. కొన్ని సాధారణ వ్యాధులలో పాదం, నోటి వ్యాధి పశువుల్లో ఎక్కువగా ఉంటాయన్నారు. వీటిని నివారించడానికి సరైన పరిశు భ్రతను పాటించాలని సూచించారు. దోమలు నివారణ, పరిశుభ్రతను పాటించడం, సకాలంలో టీకాలు వేయడం ద్వారా ఈ వ్యాధులను నివారించవచ్చునని అన్నారు. జంతువులను ప్రభావి తం చేసే అత్యంత అంటువ్యాధి వైరల్ వ్యాధి అని, దీనివలన జ్వరం, నోరు, పాదాలు తనువులపై బొబ్బలు ఏర్పడతాయని వివరించారు. అంతర్గత పరాన జీవులను నియంత్రణలో ఉంచడానికి క్రమం తప్పకుండా నులిపురుగుల నిర్మూలన వంటి చర్యలు చేపట్టాలని డాక్టర్ సూచించారు.

నేటి నుంచి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక నవోదయ విద్యాలయలో నేటి నుంచి నవోదయ విద్యాలయాల ప్రాంతీయ కబడ్డీ పోటీలు ప్రారంభమవుతాయని నవోదయ ప్రిన్సిపల్ బి.సీతాలక్ష్మి తెలిపారు. సోమవారం నవోదయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల పరిధిలోని నవోదయ విద్యాలయాలకు చెందిన 450 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. అండర్ 14, 17, 19 బాయ్స్, గర్ల్స్ క్యాటగిరీలలో పోటీలు నిర్వహిస్తారన్నారు. ఉదయం 9 గంటలకు క్రీడా జ్యోతితో ప్రారంభమై క్రీడా ర్యాలీ, శాం తి కపోతం ఎగురువేత అనంతరం పోటీలు ప్రారంభమవుతాయన్నారు. స్థానిక పారిశ్రామిక వేత్తలు మట్టే ప్రసాద్ బాబు, మట్టే శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొని పోటీలు ప్రారంభిస్తా రన్నారు. ఈ సమావేశంలో నవోదయ పిఇటిలు ఆర్.సత్యనారాయణ, పి.అనురాధ పాల్గొన్నారు.

పి-4లో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి - కరప

పేదలను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన పి-4లో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంఎల్‌ఎ పంతం నానాజీ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కూటమి నాయకులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ యుద్ధం అనంతరం శకలాలు మిగిలినట్టు గత వైసిపి ప్రభుత్వం రాష్ట్ర పరిస్థితిని తీసుకొచ్చిందని అన్నారు. రాష్ట్రాన్ని ఒక ప్రతిష్టాత్మకమైన స్థితికి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి తీసుకొచ్చిన పి-4లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, నాయకులు పెంకె శ్రీనివాస్ బాబా, కటకంశెట్టి బాబి, నులుకుర్తి వెంకటేశ్వరరావు, మామిడాల వెంకటేష్, భోగిరెడ్డి కొండబాబు, బండారు మురళీ, ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు, ఎంఇఒ బి.కృష్ణవేణి పాల్గొన్నారు.

ఘనంగా ప్రకృతి పరిరక్షణ దినోత్సవం

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని జె.కొత్తూరు గ్రామంలో హ్యాపీ చిల్డ్రన్స్ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ నకిరెడ్డి నాగేశ్వరరావు విద్యార్థులతో మొక్కలను నాటించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా విద్యార్థుల తల్లి పేరుతో మొక్కను నాటించడం జరిగిందని తెలిపారు. ఆ మొక్కను ప్రతీ విద్యార్థి సంరక్షించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



యనమలను కలిసిన అన్నవరం దేవస్థానం ఛైర్మన్

ప్రజాశక్తి - తుని

అన్నవరం దేవస్థానం ఛైర్మన్ ఐవి.రోహిత్ టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడును మర్యాదపూర్వకంగాడా కలిశారు. సోమ వారం స్థానిక తేటగుంట టిడిపి కార్యాల యంలో యనమలను కలిసిన దేవస్థానం ఛైర్మన్ రోహిత్ అన్నవరం దేవస్థానం అభివృద్ధికి సహకరించాలని కోరారు.

31లోగా దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాల కొరకు ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ వెంకటసత్య నారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎంపిసి, బిపిసి, సిఇసి, హెచ్‌ఇసి గ్రూపులకు సంబంధించి ఇంగ్లీషు, తెలుగు మీడియంలలో సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ ఏడాది ప్రథమ సంవత్సరంలో 171 మంది విద్యార్థినీ, విద్యార్థులు ప్రవేశం పొందారని అన్నారు.

ప్లాట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - పెద్దాపురం

అనధికార లే అవుట్లలో ఈ ఏడాది జూన్ 30వ తేదీ ముందు కొనుగోలు చేసిన పాట్లను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు యజమానుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మున్సి పల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 26వ తేదీ నుంచి 90 రోజులలో పురపాలక సంఘం ఎల్‌ఆర్‌ఎస్ వెబ్‌సైటులో క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసు కోవచ్చని అన్నారు. సదరు దరఖాస్తులు జిఒ ప్రకారం పరిశీలించి పీనలైజేషన్ ఛార్జీలు, సదరు స్థలంకు 14 శాతం మార్కెట్ వాల్యూ ఛార్జీలు చెల్లించిన స్థలాలను క్రమబద్ధీకరిస్తామని ఆయన తెలిపారు.

ప్రజాశక్తి
శ్రీ మరిడమ్మ అమ్మవారి
జాతర మహోత్సవ
ప్రత్యేక అనుబంధం
కాకినాడ జిల్లా
జులై 2025
Advt.feature


నరికిన తాడిచెట్లను మోసుకొస్తున్న పాత పెద్దాపురానికి చెందిన దళితులు

శ్రమైక జీవన సౌందర్యానికి ప్రతీక...

ఉయ్యాళ్ల తాళ్లోత్సవం

ప్రజాశక్తి -పెద్దాపురం

శ్రమైక జీవన సౌందర్యానికి ప్రతీకగా నేటికీ మరిడమ్మ అమ్మవారి ఊయాళ్ల తాళ్లోత్సవం కొనసాగుతోంది. ఆషాడ మాసానికి ముందు వచ్చే జ్యేష్ట పౌర్ణమి రోజున ఈ ఉత్సవాన్ని నిర్వహి స్తారు. ఈ ఉత్సవంలో అట్టడుగు వర్గాలకు చెందిన వారే కాకుండా వివిధ చేతి వృత్తులవారు, వ్యవసాయదారులు సమిష్టిగా భాగస్వాములవ్వడం విశేషం. మరిడమ్మ అమ్మవారి జాతర ఈ ఉయ్యాళ్ల తాళ్లోత్స వంతోనే ప్రారంభమవుతుంది. సంవృద్ధిగా వర్షాలు కురవాలని, పంటలు బాగా పండా లని, భావనతో ప్రజలు ఈ ఉయ్యాళ్ల తాళ్లోత్సవంలో మమేకమవుతారు. ఈ ఉయాళ్ల తాళ్లోత్సవం జరిగే ముందురోజు పాత పెద్దాపు రానికి చెందిన డప్పు కళాకారుడు దండోరా వేసి ఉత్సవం గురించి ప్రచారం చేస్తారు. ఆ రోజు రాత్రే ఏ తాడిచెట్లను ఉయ్యాళ్ల తాళ్లకు ఉప యోగిస్తారో ఆ తాడిచెట్ల మొదళ్ల వద్ద నైవేధ్యంతో ఉపారం పెడతారు. మరుసటిరోజు పాతపెద్దాపురానికి చెందిన దళితులు వారసత్వంగా ఈ నరికిన తాటిచెట్లను మోసుకు రావడానికి సిద్ధ పడతారు. మరిడమ్మ ఆలయం నుంచి గరగలు, డప్పులు, కళా కారులు భాజభజంత్రీలతో బయల్దేరి తాడిచెట్ల



వద్దకు వెళ్లతారు. అక్కడ వంశపారంపర్యంగా రజక వృత్తిదారులు చెట్లను నరుకుతారు. వాటిని దళితులు ఆలయం వరకూ మోసు కొచ్చే కార్యక్రమమే ఉయ్యాళ్ల తాళ్లోత్సవం. డప్పులు, గరగల నృత్య విన్యాసాల మధ్య ఈ తాడిచెట్లను సంప్రదాయంగా కొన్ని వీధుల మీదుగా మోసుకొస్తారు. దారి పొడవునా ఈ తాడిచెట్లకు మహిళలు పసుపు, కుంకుమలతో పూజలు చేసి బిందెలతో నీళ్లు పోస్తూ సంవృద్ధిగా వర్షాలు కురవాలని మొక్కు కుంటారు. ఈ ఉయ్యాళ్లతాళ్లను మరిడమ్మ ఆలయం ఎదురుగా ఉన్న ఖాళీస్థలం వద్దకు తీసుకొచ్చిన తర్వాత వంశ పారం పర్యంగా వస్తున్న ఆచారం ప్రకారం దూళ్ల వీర్రాజు కుటుంబీకులు గోతులు తవ్వుతారు. ఈ గోతుల్లో రెండు ఊయ్యాళ్ల తాటిచెట్లను పాతుతారు. శెట్టిబలిజ కులానికి చెందిన దెయ్యాల సుబ్బారావు కుటుంబీకులు తాడిచెట్లకు ఉయ్యాళ్లతాళ్లను కడతారు. పెద్దాపురం కుమ్మరవీధికి చెందిన కుమ్మర కుల స్తులు ఉయ్యాళ్ల తాడిచెట్టు వద్ద కొత్త కొండలో అన్నం నైవేధ్యం పెడతారు. అనంతరం డప్పులు, గరగలు అర్ధరాత్రి సమయంలో ఊరులోని నాలుగు మూలలకు వెళ్లి నైవేధ్యం పెట్టి పూజలు చేస్తారు. దీన్ని కట్టు అంటారు. అక్కడ నుంచి తాటిచెట్ల వద్దకు వచ్చిన తర్వాత ఊయ్యాలపై ఆత్రేయపురం మండలం అంకంపాలానికి చెందిన చింతపల్లి వెంకట్రావు కుటుంబీకులు కూర్చోగా ఆలయ ప్రధాన ఆషాధి(పూజారి) అమ్మవారి తల్లిగరగను ఆయన ఒడిలో పెట్టి మూడుసార్లు ఉయ్యాళ్లను ఊపుతారు. అనంతరం అమ్మవారి 12 సాధారణ గరగలు ఆయన ఒడిలో ఒకదాని తర్వాత ఒకటి పెట్టి ఊపుతారు. డప్పుల విన్యాసాలు, గరగల నృత్యాలు, భాజాబజింత్రీలు మధ్య ఊయ్యాళ్ల తాళ్లోత్సవం అత్యంత వైభవంగా ముగుస్తుంది.

వైభవంగా మరిడమ్మ అమ్మవారి జాతర

ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి

ప్రజాశక్తి - పెద్దాపురం



మరిడమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి తెలిపారు. జూన్ 25న ప్రారంభమైన ఈ ఉత్సవాలు జులై 31 వరకు జరుగుతాయన్నారు. జాతరకు పగడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. 24వ తేదీ రాత్రి జాగరణ ఉత్సవం అత్యంత వైభవంగా జరిగిందన్నారు. అమ్మవారి ఉత్సవ మూర్తిని రథంపై ఊరేగించారని తెలిపారు. జానపద, ప్రాచీన కళారూపాలు ప్రదర్శించారన్నారు. పెద్దాపురం పట్టణ వాసులే కాకుండా పలు గ్రామాల ప్రజలు వచ్చి తిలకించారని తెలిపారు. జాతరకు వచ్చే యాత్రికులందరూ అమ్మవారిని దర్శించుకునేలా క్యూ లైన్లు ఏర్పాటు చేశామన్నారు. వృద్ధులు, వికలాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు కల్పించామన్నారు. యాత్రికులకు మంచి నీటి ఏర్పాట్లు, వృద్ధులు, పిల్లలకు పాలు అందజేస్తున్నామని తెలిపారు. అలాగే దాతల సహకారంతో మరుగుదొడ్లు ఏర్పాటు చేశామన్నారు. వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది ఆలయం వద్ద ప్రత్యేక మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారని తెలిపారు. వర్షాలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక పారిశుధ్య సిబ్బందిని నియమించామన్నారు. జాతర అవసరాలను దృష్టిలో పెట్టుకుని 30 మంది అదనపు సిబ్బందిని నియమించామన్నారు. అలాగే దేవాదాయ శాఖ వివిధ ఆలయాలకు చెందిన 12 మంది సిబ్బందిని ఇక్కడికి కేటాయించిందన్నారు. ప్రతి ఆది, మంగళ, గురు వారాల్లో జాతరకు వచ్చే యాత్రికుల రద్దీ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని పలు డిపోల నుంచి ప్రత్యేక ఆర్‌టిసి సర్వీసులు నడిపారన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారన్నారు. జాతరకు వచ్చే యాత్రికులను దష్టిలో పెట్టుకుని ఆలయ కాలక్షేప మండపంలో వివిధ కళారూపాల ప్రదర్శనలు ఏర్పాటు చేశామన్నారు. ఆలయ సిబ్బందితోపాటు, వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు సహాయ సహకారాలతో జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

సమిష్టి జీవన ప్రతీకలు... గ్రామ దేవతలు



ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రాచీన సామాజిక సమిష్టి జీవనప్రతీకలే గ్రామదేవతలుగా నేటికీ పూజలందుకోవడం విశేషం. సమాజం పైనా, కుటుంబం పైనా పురుషుని పెత్తనం ప్రారంభం కాకముందు మాతృస్వామిక వ్యవస్థలో పుట్టిన దైవభావానికి ప్రతీకలే ఈ గ్రామదేవతలు. పెళ్లిళ్ల, కుటుంబ వ్యవస్థలేని ప్రాచీన మాతృస్వామిక వ్యవస్థలో ఆహార భద్రత, ఆహారం పంపిణీ, ఇంటి నిర్వహణ, పిల్లలను పెంచడం వంటి సమస్థం మహిళలే నిర్వహించేవారు. ఆనాటి సమాజంలో పిల్లలను కంటికిరెప్పలా తల్లిమాత్రమే సంరక్షించేది. పురుషునికి ఏమాత్రమూ బాధ్యతలు లేవు. ప్రకృతి వైపరీత్యాలు, తుపానులు, అగ్నిప్రమాదాలు వంటి పెనుముప్పులు సంభవించినప్పుడు ఆనాటి ప్రజలమదిలో పుట్టిన అమ్మతల్లులే ఈ గ్రామదేవతలు. సమాజ నిర్వహణలోనూ అందరినీ ఆదుకోవడంలోనూ ప్రధానపాత్ర మహిళే వహిస్తున్నందున ఆనాటి ప్రజల హృదయాల్లో తమను ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షించే దైవం మహిళగానే ఉద్భవించింది. ఆనాటి నుంచి రాయి, రప్ప, చెట్టు, పుట్ట అమ్మతల్లులుగా పూజలందుకుంటున్నాయి. కాలక్రమేణ అమ్మ తల్లులు గ్రామాలేర్పడిన తర్వాత, కుటుంబ వ్యవస్థ ప్రారంభమైన తర్వాత గ్రామదేవతలుగా పిలవబడుతున్నారు. అనంతరం కాలంలో సమాజ పరిణామక్రమంలో వ్యవసాయం, చేతివృత్తులు అభివృద్ధి చెంది గ్రామీణవ్యవస్థ పటిష్టమైన తర్వాత గ్రామదేవతల ఉత్సవాలను నిర్వహించే సంస్కృతి ప్రారంభమైంది.

పురాణాలు పుట్టకముందే గ్రామదేవతలు

పురాణాలు పుట్టకముందు నుంచి గ్రామ దేవతలు భారతీయ సమాజంలోని అన్ని అంగాల్లోనూ పూజలందుకుంటున్నారు. అందుకే గ్రామదేవతల ఉత్సవాలు తిథులు, నక్షత్రాలు, ముహుర్తాలు వంటి జోలికి పోకుండా అమావాస్య, పౌర్ణమి వంటి ప్రాచీన ప్రజల గుర్తింపు పొందిన రోజులనే నిర్ణయిస్తారు. ఆనాటి సమాజంలో ఆయా ప్రాంతీయ, భౌగోళిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఆయా ప్రాంతాల ప్రజలు ఈ గ్రామదేవతల ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

సమిష్టితత్వానికి ప్రతీకలు గ్రామదేవతలు

గ్రామదేవతుల సమిష్టితత్వానికి ప్రతీకలుగా నేటికీ కొనసాగుతున్నారు. భారతీయ సమాజంలో నేటికీ కొనసాగుతున్న సమిష్టి భావానికి ప్రతీకగా భావించొచ్చు. పురాణ దేవతలను లక్ష్మీదేవి, పార్వతీదేవి, సరస్వతీ దేవి అని కొలుస్తూ పూజిస్తారు. కానీ గ్రామదేవతలను మరిడమ్మ, సత్తెమ్మ, నూకాలమ్మ, పరదేశమ్మ, పోలేరమ్మ, గొంతాలమ్మ, రావులమ్మ, తదితర పేర్లతో పిలుస్తారు. అమ్మ అంటే అందరినీ ఒకేలా చూసే భావానికి నిదర్శనం. ఈ గ్రామదేవతలను గ్రామంలోని కులాలతో సంబంధం లేకుండా అందరూ పూజిస్తారు. తమ గ్రామం బాగుండాలని, ఎవ్వరూ రోగాలబారిన పడకుండా తమను రక్షించాలని, సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, గ్రామస్తులు గ్రామదేవతల ఉత్సవాలు నిర్వహిస్తారు. అదే పురాణ దేవతలనైతే 'నేను, నా కుటుంబం బాగుండాలి, నేను అభివృద్ధి చెందాలి' అనే భావజ్ఞానంతో కూడిన వ్యక్తిగత ప్రయోజనం నేపథ్యంలో పూజలు జరుపుతారు. ఇందులో సమిష్టితత్వానికి చోటు ఉండదు. కులవ్యవస్థ, వృత్తివ్యవస్థ బలీయమైన కాలంలోనూ ఒక గ్రామంలోని ఒక ప్రాంతం వారు, లేదా ఒక కులం వారు ప్రత్యేకంగా గ్రామదేవత సంబరాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

పెద్దాపురం గ్రామదేవత మరిడమ్మ



పెద్దాపురంలో రాచరిక వ్యవస్థ ప్రారంభం కాకముందే మరిడమ్మ ఉందని పూర్వీకుల నుంచి వినిపిస్తున్న భావన. పట్టణానికి ఉత్తరం వైపున ప్రవహిస్తున్న ఏలేరునదిని ఆనుకుని అనేక గ్రామాలున్నాయి. అలాగే పెద్దాపురం పట్టణం ఏలేరు నదిని ఆనుకుని నిర్మిస్తారు. నేటికీ ఏలేరు నదిని ఆనుకుని ఉన్న పట్టణాన్ని పాతపెద్దాపురంగా పిలుస్తున్నారు. పెద్దాపురాన్ని పాలించిన రాజులు పెద్దాపురం పట్టణానికి పడమరవైపు ఉన్న పాండవుల మెట్ట, గవ్వల మెట్టను రక్షణ దుర్గాలుగా ఏర్పాటుచేసుకున్నారు. వీటికి సమీపంలోనే కోటను నిర్మించుకున్నారు. ఇప్పుడు మరిడమ్మ అమ్మవారి ఆలయం ఉన్న ప్రదేశం ఒకప్పుడు అడవిగా ఉండేది. అప్పటికే కూడలిగా ఉన్న పెద్దాపురం చుట్టుపక్కలా అనేక ప్రాంతాల్లో పేరు, ప్రఖ్యాతలు పొందింది. ఈ గ్రామవాసులే కాకుండా చుట్టుపక్కలా ఉన్న ప్రాంతాల వారు అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చేవారు. కొయ్యబొమ్మ రూపంలో ఈ అమ్మవారు పూజలు అందుకునేదని ప్రజలు అనుకునేవారు. ఈ ప్రాంతంలో నీటిసమస్య తీవ్రంగా ఉండేది. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన యాత్రికులు వేసవిలో మంచినీటికి తీవ్ర ఇబ్బందులు పడేవారు. వత్సవాయి రాజుల ఆస్థానంలో సైనిక విభాగంలో పనిచేసే మానోజీరావు ఒకరోజు అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చి అక్కడ మంచినీటి కష్టాలను చూసి నీటిసమస్య పరిష్కారానికి ఆలయం సమీపంలో మంచినీటి చెరువును తవ్వించారు. నేటికీ ఆ చెరువును మానోజీ చెరువుగా పిలుస్తున్నారు. కాలక్రమంలో తాటాకుల గుడిలో కొయ్య బొమ్మగా మరిడమ్మ అమ్మవారు ఉండేవారు. అనంతరం ఆలయ విస్తరణ, గోపురాలు, అనేక మార్పులతో ప్రస్తుతం రాష్ట్రంలో ప్రసిద్ధ గ్రామదేవత ఆలయంగా పేరుపొందింది. రాచరిక వ్యవస్థ అనంతరం పెద్దాపురం పట్టణంలో వ్యవసాయరంగం, పారిశ్రామికరంగం పురోభివృద్ధిలో భాగంగా పెద్దాపురం పట్టణం నలువైపులా విస్తరించింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి అనేక కుటుంబాలు పెద్దాపురం పట్టణానికి వలసలొచ్చాయి. ఈవలస వచ్చినవారిలో వ్యవసాయ కూలీలు, చేతివృత్తుల వారు, చేనేత కార్మికులు ఉన్నారు. వీరి రాకతో పెద్దాపురం పట్టణం నలువైపులా విస్తరించి అనేక పేటలుగా అభివృద్ధి చెందింది. అనేక ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ నివాస ప్రాంతాల్లో తమతమ గ్రామాల్లో తమ పూర్వీకులు పూజించిన గ్రామదేవతలను ప్రతిష్టించుకుని పూజలు చేసినప్పటికీ ప్రధాన గ్రామదేవతగా మరిడమ్మ అమ్మవారిని కొలవడం మానలేదు. అంతేకాకుండా మరిడమ్మ అమ్మవారి జాతర జరిగే నెలరోజులపాటు ఆయా ప్రాంత ప్రజలు ప్రత్యేక సంబరాలు నిర్వహించి అమ్మవారి పట్ల తమకున్న భక్తిని ప్రదర్శించుకుంటున్నారు.


గ్రామీణ హృదయ స్పందనలే జానపద కళారూపాలు


పులి వేషం

ప్రజాశక్తి -పెద్దాపురం

మాతృస్వామిక వ్యవస్థలో పుట్టుకొచ్చిన గ్రామదేవతల సంబరాలు నేటి ఆధునిక సమాజంలోనూ కొనసాగడం విశేషం. నేటి ప్రపంచీకరణ విస్తరణలో పురాతన కాలంలో పుట్టిన అనేక కళారూపాలు, శాస్త్రీయ, జానపద కళారూపాలు కనుమరుగవుతుంటే కొన్ని కళారూపాలు మాత్రం నేటికీ జనంతో రక్షించబడుతున్నాయి. అందుకు కారణం గ్రామదేవతల జాతరలు, ఉత్సవాలు నేటికీ కొనసాగడమే. ఒక రకంగా చెప్పాలంటే గ్రామదేవతల జాతరలు ప్రాచీన జానపద కళారూపాల పరిరక్షణ వేదికలుగా పాత్రలు నిర్వహిస్తున్నాయి. నేటికీ జానపద కళారూపాలను కాపాడుకుంటూ వస్తున్నాయి ఈ జాతరలే. జానపద కళారూపానికి ఊపిరి సమిష్టితత్వమైతే శాస్త్రీయ కళారూపాలకు హృదయం, వ్యక్తిగత ప్రతిభ. అందుకే శాస్త్రీయ కళారూపాన్ని తిలకించిన, హృదయం స్పందించాలంటే మనకు ఆ కళారూపాల శాస్త్రీయతపై ప్రవేశం ఉండాలి. అందుకే వీటిని తిలకించిన వారిలో కొందరు మాత్రమే ఆ కళారూపాలను ఆస్వాదించ గలుగుతారు. జానపద కళారూపాలు సమిష్టితత్వానికి నిదర్శనం. అందుకే వీటిని తిలకించిన వారందరూ ఆ కళారూపాల భావవేషంలో మమైకమవుతారు. సమిష్టి ఆనందంలో భాగస్వాములవుతారు. పెద్దాపురం మరిడమ్మ జాతర సందర్భంగా జరిగే జాగరణోత్సవంలోనూ, అన్ని ప్రాంతాల వారు నిర్వహించే సంబరాల్లోనూ ఈ జానపద కళారూపాలు నేటికీ ప్రముఖపాత్ర వహిస్తున్నాయి. పెద్దాపురం పట్టణంలోని కొత్తపేటలో 2, శెట్టిగపేట, పాశీలవారి వీధి, కుమ్మరవీధి, వరహాలయ్యపేట, నువ్వులగుంట వీధి, కబడ్డీ వీధి, బంగారమ్మ గుడివీధి 2, వ్యాపారపుంత, పాతపెద్దాపురం, కాకర్లవారి వీధి, తదితర ప్రాంతాల వారు నేటికీ ఈ సంబరాలను నిర్వహిస్తున్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు రూ.లక్షల్లో వ్యయం చేసి ఈ సంబరాలను అత్యంత వైభవంగా నిర్వహించడం విశేషం. సంబరాలు జరిగే రోజున వారి బంధుమిత్రలందరినీ ఆహ్వానించడంతో సంబరాలు జరిగే ప్రాంతమంతా పండుగ వాతావరణం నెలకొంటుంది. ఈ సంబరాలను అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన యాత్రికులు, పట్టణవాసులే కాకుండా పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు తండోపతండాలుగా వచ్చి తిలకించి ఆనందించడం విశేషం.


తప్పెటగుళ్లు


గరగలు


హరికథ


శక్తి వేషం




బండ వేషాలు

మరిడమ్మకు రెండు జాగరణ ఉత్సవాలు



ప్రజాశక్తి -పెద్దాపురం

ఏ గ్రామంలోనైనా గ్రామదేవత జాతరకు సంబంధించి ఒక జాగరణ ఉత్సవం మాత్రమే జరుగుతుంది. పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి మాత్రం ఒకేరోజు రెండు ప్రాంతాల్లో రెండు జాగరణ ఉత్సవాలు జరగడం విశేషం. కొత్తపెద్దాపురం ఏర్పడ్డాక ముందు పాతపెద్దాపురం వాసులే మరిడమ్మ అమ్మవారికి సంబంధించి జాతరలు, ఉత్సవాలు, జాగరణ ఉత్సవాలు నిర్వహించేవారు. కాలక్రమేణ పెద్దాపురం పట్టణం ఏర్పడటంతో మరిడమ్మ అమ్మవారి ఆలయం అభివృద్ధి చెంది ఆదాయం పెరిగింది. 1952 తర్వాత ఈ ఆలయాన్ని దేవాదాయ, ధర్మాదాయశాఖ అధీనంలోకి వెళ్లింది. అప్పటి వరకూ మరిడమ్మ అమ్మవారి జాగరణ ఉత్సవాన్ని పాతపెద్దాపురం వాసులే నిర్వహించేవారు. దేవాదాయ, ధర్మాదాయశాఖ అధీనంలోకి వెళ్లిన తర్వాత ఆలయం వద్దనే దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యాన ఈ జాగరణ ఉత్సవం నిర్వహించడం ప్రారంభమైంది. అయినప్పటికీ పాతపెద్దాపురం వాసులు తరతరాలుగా తాము ఈ జాగరణ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామనే భావంతో ఆలయం వద్ద దేవాదాయశాఖ జాగరణ ఉత్సవం చేసినప్పటికీ పాతపెద్దాపురంలో అదేరోజున జాగరణ ఉత్సవాన్ని అత్యంతవైభవంగా నిర్వహిస్తున్నారు. సంప్రదాయం ప్రకారం మరిడమ్మ అమ్మవారి గరగలు జాగరణ రోజున పాతపెద్దాపురం వెళ్లి పాతపెద్దాపురంలోని సత్తెమ్మగుడి వద్ద గరగలకు పాన్పువేసి అక్కడ జాగరణ ఉత్సవం ప్రారంభమైన తర్వాత అదే గరగలను మరిడమ్మ అమ్మవారి ఆలయానికి తీసుకొస్తారు. ఆ తర్వాత ఇక్కడ జాగరణ ఉత్సవం ప్రారంభమవుతుంది. పాతపెద్దాపురం వాసులు నేటికీ తమ సొంత డబ్బులు లక్షలాది రూపాయలను ఉత్సవాన్ని నిర్వహించడం విశేషం. ఈ ఉత్సవంలో బండ్లవేషాలు, సాముగరిడీలు కాళికానృత్యాలు, పెద్దపులి ఆటలు, తప్పిడిగుళ్లు, తదితర ప్రాచీన జానపద కళారూపాలు ఏర్పాటుచేయడంతో ఈ జాగరణ ఉత్సవం నేటికీ ప్రజల మన్ననలు పొందుతుంది. ఈ సందర్భంగా ప్రాంతవాసులు మాట్లాడుతూ తాము ఎప్పటికీ ఈ జాగరణ ఉత్సవాన్ని నిర్వహిస్తామని ప్రకటించడం విశేషం.



ఆర్‌డిఒకు ప్రసాదాన్ని అందిస్తున్న ఎసి

మరిడమ్మను దర్శించుకున్న ఆర్‌డిఒ

ప్రజాశక్తి -పెద్దాపురం

పెద్దాపురం ఆర్‌డిఒ శ్రీరమణి మరిడమ్మ అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కే విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు ఆమెకు ఆశీర్వచనాలతో తీర్థప్రసాదాలను అందజేశారు. ఆమె వెంటె ఎసి విజయలక్ష్మి ఇతర సిబ్బంది ఉన్నారు.

ఘనంగా బుక్కా సంబరం

పెద్దాపురం : మరిడమ్మ జాతర లో భాగంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్. కే విజయలక్ష్మి పర్యవేక్షణలో మరిడమ్మ అమ్మవారి బుక్కా సంబరం ఘనంగా నిర్వహించారు. అనాదిగా వస్తున్న ఆచారంలో భాగంగా గరగల నృత్యాలు తో బుక్కా రంగులు చలు ్లకుంటూ అత్యంత వైభవంగా ఈ బుక్కా సంబరాన్ని నిర్వహించారు. సంబరం లో భాగంగా ఆలయం వద్ద ప్రారంభించిన ఈ ఉత్సవం ఆనవాయితీ గా మెయిన్ రోడ్, మరికొన్ని ప్రదేశాల మీదుగా కొన్ని వీధులు మీదుగా గరగల నృత్యాలతో ఈ సంబరాన్ని నిర్వహించి మరిడమ్మ